సాక్షి వనపర్తి

బుధవారం, 23, ఆగస్టు, 2023



తండాల్లో.. తీజోత్సవం
నల్లమలలో లంబాడాలు మొలకల పండు గను ఉత్సాహంగా జరుపుకొంటున్నారు.
వివరాలు 10లో ▸



రెండు జూనియర్ కళాశాలలు
మహ్మదాబాద్, చిన్నచింతకుంటకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మంజూరయ్యాయి.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /22.9

వాతావరణం
ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రమంగా ఆకాశం మేఘావృతం అవుతుంది. అడపాదడపా వర్షం పడవచ్చు.

న్యూస్‌రీల్

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఎస్పీ రక్షిత కే. మూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో కేసుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. డ్రంకెన్‌డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పెండింగ్ కేసులు జాప్యం లేకుండా చూడాలన్నారు. డయల్ 100కు వచ్చిన ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. స్టేషన్‌లో పనితీరు, తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ జగదీశ్వర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ కాంగ్రెస్‌లో ముసలం



చిన్నంబావి: కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తే ఇటీవల పార్టీలో చేరిన మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు తనతోపాటు అనుచరులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు అన్నారు. మంగళవారం ఆయన ఇందిరాగాంధీ ఆడిటోరియంలో తన అనుచరులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మాభిమానం దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదని మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీమంత్రి జూపల్లిని పార్టీలోకి స్వాగతిస్తే నన్ను రాజకీయంగా లేకుండా చేయాలని కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. నా సొంత మండలంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తే తనకు కనీస సమాచారం ఇవ్వలేదని, అలాగే నియోజకవర్గంలో జూపల్లి స్వతహాగా పార్టీ కార్యక్రమాలు చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. తన పట్ల కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న జూపల్లిపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ప్రతి కార్యకర్త అభిప్రాయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. మరో పదిరోజుల్లో అధిష్టానం నుంచి సరైన స్పందన రాకపోతే తన సత్తా ఏమిటో చూపిస్తానని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు బీరయ్యయాదవ్, నాయకులు నర్సింహయాదవ్, శ్రీనివాసులు, వహీద్, శివన్న, పరమేష్, బాబ, రమేష్, భార్గవ్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, మధుసూదన్ పాల్గొన్నారు.

బీజేపీ పార్లమెంట్ స్థానాలకు కన్వీనర్ల నియామకం

సాక్షి, నాగర్‌కర్నూల్: లోక్‌సభ పార్లమెంట్ స్థానాల వారీగా కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రకటన జారీ చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల వరకు వీరు పార్టీ తరఫున పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి పార్టీ కన్వీనర్‌గా పి.పవన్‌కుమార్ రెడ్డిని నియమించగా, జాయింట్ కన్వీనర్లుగా ఎ.నరసింహాగౌడ్, భీంరెడ్డి నియమితులయ్యారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో కన్వీనర్లుగా రాగి రామకృష్ణారెడ్డి, జింకల కృష్ణయ్య నియామకం కాగా, జాయింట్ కన్వీనర్లుగా పెద్దపెద్ది కమలేశ్, ఎం. సంజీవ భరద్వాజ నియమించారు.

ప్రభుత్వ ఖాతాలో రూ.21.33 కోట్లు జమ

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నూతన మద్యం లైసెన్స్‌దారులు దుకాణాలకు సంబంధించి ఏడాది ఫీజులో ఫస్ట్ ఇన్‌స్టాల్‌మెంట్ 1/6 వంతు డబ్బులు ప్రభుత్వ ఖాతాలో జమ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న 230 దుకాణాలకు సంబంధించి దుకాణాల ఫీజు రూ.21.22 కోట్లను మంగళవారం ప్రభుత్వ ఖాతాలో జమ చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు స్లాబ్‌లు ఉన్నాయి. ఇందులో మహబూబ్‌నగర్ పట్టణంలో స్లాబ్ రూ.65 లక్షలు ఉంటే రూ.10 లక్షలు, నారాయణపేటలో స్లాబ్ రూ.55లక్షలు ఉంటే రూ.9.16 లక్షలు జమచేశారు. ప్రస్తుతం దుకాణాలు సొంతం చేసుకున్న లైసెన్స్‌దారులు డిసెంబర్ 1వ తేదీ నుంచి మద్యం విక్రయాలు నిర్వహించనున్నారు.

‘ఉన్నతి’కి శ్రీకారం



వనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాలలో 9వ, తరగతి విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- ఆరు నుంచి 9వ తరగతి విద్యార్థులకు వర్తింపు
- కనీస అవగాహన పెంపొందించేందుకు చర్యలు
- త్వరలోనే అమలు కానున్న లర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం(లిప్)
- జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు ప్రారంభమైన శిక్షణ తరగతులు

పాఠశాల పేరు	సంఖ్య
జెడ్పీహెచ్‌ఎస్	99
ప్రభుత్వ	2
కేజీబీవీ	15
మోడల్	3
ఆశ్రమ	1
ప్రాథమికోన్నత	58
మొత్తం విద్యార్థులు	30,100

శిక్షణకు హాజరుకానున్న ఉపాధ్యాయులు : 900

వనపర్తిటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 6 నుంచి 9 తరగతుల విద్యార్థుల్లో లర్నింగ్(చదవడం, రాయడం) ఇంప్రూమెంట్ ప్రోగ్రాంకు శ్రీకారం చుట్టారు. 10వ తరగతికి విద్యార్థి వచ్చే లోపు 6 నుంచి 9వ తరగతి వరకు చదివిన ప్రతి సబ్జెక్టులోని మూలాలను తెలుసుకునేందుకు లిప్(లర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం) చేపట్టనుంది. ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు కూడికలు, తీసివేతలు, ఓనమాలు, ఇంగ్లీష్‌లోని చిన్న చిన్న పదాలు తదితర వాటిని నేర్పించేందుకు తొలిమెట్టు పేరుతో ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తున్నట్టే.. 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులకు ఉన్నతి పేరుతో విద్యార్థుల్లో ఆయా సబ్జెక్టుల్లో పూర్వపు పరిజ్ఞానం పెంపొందించేలా చర్యలు చేపట్టనున్నారు.

- దేశవ్యాప్తంగా నేషనల్ అచ్యూవ్‌మెంట్ 2017, 2021లో విద్యార్థుల అవగాహన పై సర్వే నిర్వహించగా.. చాలా వరకు విద్యార్థులు కనీస అవగాహన లేకుండా ఉన్నారని తేలడంతో పాటుగా జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రం 34, 36 స్థానాల్లో నిలవడంతో రాష్ట్ర విద్యాశాఖ ‘ఉన్నతి’ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది.

నలుగురు ఉపాధ్యాయుల చొప్పున..

ప్రతి మండలానికి సబ్జెక్టుకు నలుగురు ఉపాధ్యాయుల చొప్పున మొత్తం 28 మంది ఉపాధ్యాయులు, మరో నలుగురు ప్రధానోపాధ్యాయులతో మొత్తంగా 32 మంది ఉపాధ్యాయులను ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించేందుకు సోమవారం (ఆగస్టు 21న) నుంచి తొమ్మిది రోజుల శిక్షణను ప్రారంభించారు. ఒక్కో సబ్జెక్టుకు 110, 120 కొన్ని సబ్జెక్టులకు 140 చొప్పున ఉపాధ్యాయులకు, హెచ్‌ఎంలకు తొమ్మిరోజుల పాటు 900 మంది ఉపాధ్యాయులకు వివిధ దశల్లో ‘ఉన్నతి’ పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించనున్నారు.

శిక్షణ తర్వాత అమలు



ఉన్నత తరగతుల విద్యార్థులకు లర్నింగ్, రీడింగ్, మౌలికమైన అంశాలు అర్థమయ్యేందుకు ‘ఉన్నతి’ దోహదం కానుంది. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అమలు చేసిన తొలిమెట్టు జిల్లాలో సత్ఫలితాలను ఇచ్చింది. అదే తరహాలో ఉన్నతి కార్యక్రమం విద్యార్థులకు ఆశించిన అవగాహన పెరగడంతో పాటుగా భాషా అంశాల్లోని మౌలిక అంశాలు అర్థం చేసుకోవడం ద్వారా ఇతర సబ్జెక్టులపై అవగాహన పెరిగేందుకు అవకాశం ఉంటుంది. ఉపాధ్యాయులకు శిక్షణ అనంతరం జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తాం.

– మహానంది, ఏఎంఓ వనపర్తి

ప్రాథమిక పాఠశాలలో మొక్కుబడిగా విద్యను అభ్యసించి పైతరగతులకు వచ్చే విద్యార్థులు గణితంలో భిన్నాలు, పూర్ణ సంఖ్యలు, కాసాగు, గాసాభా, బీజీయ సమీకరణాలు తదితర అంశాలు, తెలుగు, హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో చదవడం, చదివిన అంశాలను అర్థం చేసుకోవడం, వ్యాకరణ అంశాలు తదితర వాటిపై విద్యార్థులు పట్టు సాధించేలా ఉన్నతితో ముందుకు సాగనున్నారు.

లిప్ లక్ష్యం..

లాంగ్వేజ్ సబ్జెక్టులు పరిపూర్ణంగా వస్తేనే సైన్స్, భౌతిక రసాయన శాస్త్రం, సోషల్ సబ్జెక్టులను సైతం విద్యార్థి అవగతం చేసుకునే వీలు ఉంటుంది. ప్రతి రోజూ పాఠశాల సమయంలో ఆయా సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు వారి పిరియడ్‌లో బోధించే సబ్జెక్టును తరగతి గదిలో తొలుత 10 నిమిషాల పాటు విద్యార్థులతో చదివించడం, రాయించడం విధిగా చేయాల్సి ఉంటుంది. ఇలా ఈ విద్యాసంవత్సరం నుంచి ఉన్నతి పేరుతో ప్రతి సబ్జెక్టు ఉపాధ్యాయుడు వారి సబ్జెక్టులపై తరగతి గదిలోని విద్యార్థులు అందరూ పట్టు సాధించేలా ఉన్నతి శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులకు అందించనున్నారు.

సబ్జెక్టుపై సామర్థ్యం పెంచేందుకు కృషి

కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



మధ్యాహ్న భోజనానికి తీసుకొచ్చిన కూరగాయలను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

వనపర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల్లో సబ్జెక్టు సామర్థ్యం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. మంగళవారం ఖిల్లాఘనపురం మండలం సోలీపూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఆయా సబ్జెక్టులపై విద్యార్థుల్లోని సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు కొన్ని ప్రశ్నలు అడిగారు. ఇంగ్లీష్‌పై విద్యార్థులకు ఉన్న పట్టు ఎంత అనే విషయం తెలుసుకునేందుకు పాఠం చదివించారు. 6, 10 విద్యార్థులతో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలపై చేస్తున్న బోధన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. పోటీ ప్రపంచంలో ఇంగ్లీష్ ప్రతి విద్యార్థికి వచ్చి ఉండాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం వంటలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా? అని విద్యార్థులను అడిగారు. ప్రతిరోజూ తాజా కూరగాయలతో, శుభ్రమైన వాతావరణంలో వండి విద్యార్థులకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఉపాధ్యాయులు టీచింగ్ డైరీ నిర్వహణను విస్మరించరాదన్నారు. గణితం, ఆంగ్లంపై ఎక్కువ దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పేదల సొంతింటి కల సాకారం



గట్టుకాడిపల్లిలో గ్రామపంచాయతీ కార్యాలయానికి భూమిపూజ చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: పేదప్రజల సొంతింటి కల సాకారం చేయాలనే ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్ డబుల్‌బెడ్రూం ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు నిర్వహించడంతో పాటుగా ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంచారు. అంతకు ముందు మంత్రి హైదరాబాద్ నుంచి నేరుగా ఖిల్లాఘనపురం మండలంలోని గట్టుకాడిపల్లికి చేరుకుని శ్రీలక్ష్మీఅలవేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం మాట్లాడారు. వనపర్తి నియోజకవర్గంలో మొత్తం 3,225 ఇళ్లు మంజూరు చేయగా.. ఇప్పటి వరకు 3 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. ఖిల్లాఘనపురం మండలంలో ఒక్క రోజే 539 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. వీటికి తోడుగా ప్రజల కోరిక మేరకు గృహలక్ష్మీ పథకం ద్వార ఒక్కో ఇంటికి రూ.3 లక్షలు అందిస్తున్నామన్నారు. గట్టుకాడిపల్లిలో గ్రామపంచాయతీ భవనం, కమాలొద్దీన్‌పూర్‌లో ఆరోగ్య ఉపకేంద్రం, గౌడ, శాలివాహన కమ్యూనిటీహాల్, ఖిల్లాఘనపురంలో ఆరెకటిక కమ్యూనిటీహాల్ భవనాన్ని ప్రారంభించడంతో పాటుగా ఆరోగ్య ఉపకేంద్రం, సమీకృత మార్కెట్ నిర్మాణాలకు, సోళీపురంలో యాదవ కమ్యూనిటీ హాల్, ఆముదంబండ తండాలో ఎస్టీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపనలు చేశారు. ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యులు సామ్యనాయక్, లక్ష్మారెడ్డి, బాలీశ్వర్‌రెడ్డి, మురళీధర్ రెడ్డి, వెంకటరమణ, సతీష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యా సామర్థ్యాలు పెంచాలి

రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, రాష్ట్రస్థాయి అధికారులు, కలెక్టర్లు వల్లూరి క్రాంతి, ఉదయ్‌కుమార్, తేజస్ నందలాల్ పవార్

వనపర్తి: విద్యార్థుల్లో గుణాత్మక విద్యా సామర్థ్యాలు పెంచాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ సూచించారు. మంగళవారం స్థానిక సమీకృత కలెక్టరేట్‌లో వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీఈఓలు, ఎంఈఓలు, ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారులు, క్లస్టర్ హెచ్‌ఎంలు, సెక్టోరియల్ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌లతో సమీక్ష నిర్వహించారు.

ఆరో తరగతిలో ప్రవేశించిన విద్యార్థులు..

ఉన్నతి, తొలిమెట్టు, మన ఊరు–మన బడి పథకాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు కనీస విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని గత ఆగస్టులో ప్రవేశపెట్టి అమలు చేయడంతో ఈ విద్యాసంవత్సరం ఉన్నత పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశించిన విద్యార్థులు నాణ్యమైన విద్యా ప్రమాణాలు కలిగి ఉన్నారని అన్నారు. తొలిమెట్టు కార్యక్రమాన్ని మరింత విజయవంతంగా అమలు చేసేందుకు, 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ‘ఉన్నతి’ అనే కార్యక్రమం, 10వ తరగతి విద్యార్థుల్లో లక్ష్యం మరింత బలోపేతం చేసేందుకు లక్ష్యా అనే మూడు కార్యక్రమాలను చేపడుతున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్లు తరచుగా సమావేశాలు ఏర్పాటు చేసి సమీక్షించాలని సూచించారు.

- వనపర్తి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాలో తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని, 3 నుంచి 5 తరగతి విద్యార్థులు తెలుగు చదవడం, రాయడం, గణితంలో కూడికలు, తీసివేతలు, గుణింతాలు బాగాహారాలు ఎలాంటి తప్పులు లేకుండా చేయగలుగుతున్నారని, క్రమం తప్పకుండా క్లస్టర్ హెడ్మాస్టర్లు, ఎంఈఓలతో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేస్తున్నట్లు వివరించారు. ఇంగ్లీష్‌లో మాత్రం విద్యార్థులు కాస్త ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విద్యా సంవత్సరం జిల్లాలో తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్యా కార్యక్రమాలను ప్రణాళిక ప్రకారం అమలు చేసి విద్యార్థుల విద్యా ప్రమాణాలు మరింత పెంచేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్, గద్వాల కలెక్టర్ వల్లూరు క్రాంతి, నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, గద్వాల అదనపు కలెక్టర్ చౌహాన్, వనపర్తి అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతి రావు, ఎస్.సి.ఆర్.టి. డైరెక్టర్ రాధారెడ్డి, ఏఎస్‌పీడీ సమగ్ర శిక్ష అభియాన్ రమేష్, తొలిమెట్టు రాష్ట్ర నోడల్ అధికారి కృష్ణ వినాయక్, ఆర్‌జేడీ విజయలక్ష్మి, డీఈఓలు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రతివారం వైద్యపరీక్షలు

డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవిశంకర్




అమరచింతలో ఆరోగ్య మహిళా బ్రోచర్‌ను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవిశంకర్

అమరచింత: జిల్లాలోని ప్రభుత్వ పీహెచ్‌సీలో ప్రతి వారం ఆరోగ్య మహిళా కార్యక్రమంతో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవిశంకర్ అన్నారు. మండల కేంద్రంలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్‌తో కలిసి ఆరోగ్య మహిళా కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మహిళల సంరక్షణ కోసం ప్రభుత్వం ఎన్నో వసతులను ప్రభుత్వ ఆస్పత్రుల్లో కల్పిస్తుందని అన్నారు. 18 సంవత్సరాల నుంచి ఆపై వయస్సు ఉన్న మహిళల ఆరోగ్యాలను సంరక్షించేందుకు ఆరోగ్య మహిళా కార్యక్రమం చేపట్టిందన్నారు. దీంతో ఆయా గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు సమీపంలోని పీహెచ్‌సీలకు వచ్చి ప్రతి మంగళవారం తమ ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకునే అవకాశం కల్పించిందన్నారు. అనంతరం డీఎంఆర్‌ఎం ఆస్పత్రిని పరిశీలించి నిరంతరం రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యాధికారులు ముందుండాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరిగేలా చొరవ చూపాల్సిన బాధ్యత సంబంధిత ఏఎన్‌ఎంలు ఆశ వర్కర్లపై ఉందన్నారు. ఈగలు, దోమలు నిల్వ ఉండకుండా పంచాయతీ, మున్సిపల్ అధికారుల సహకారంతో ఫాగింగ్ చేయించాల్సిన బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. తిప్పడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శరత్, నాగభూషణం గౌడ్, డాక్టర్లు రుపశ్రీ, నిఖిత, సురేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వారి దారెటు..!

- బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఖరారుతో పలువురి ఆశావహుల్లో నిరాశ
- ముఖ్య అనుచరులు, ఆత్మీయులు, కార్యకర్తలతో సీక్రెట్‌గా సమాలోచనలు
- అలంపూర్, కల్వకుర్తి, అచ్చంపేట, మక్తల్ అసెంబ్లీ స్థానాల్లో ప్రభావం
- ఇరువురు నేతలతో సమన్వయానికి అధిష్టానం కసరత్తు
- అసమ్మతులను బుజ్జగించేలా చర్యలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందుగానే పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేయడంతో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్ నెలకొన్నప్పటికీ.. టికెట్ ఆశించి భంగపడిన ఆశావహుల్లో నిరాశ అలుముకుంది. ఈ మేరకు పాలమూరులోని పలు శాసనసభ నియోజకవర్గాలకు చెందిన నేతలు భవిష్యత్ కార్యాచరణకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో తమ తమ సెగ్మెంట్లకు చెందిన ముఖ్య నాయకులు, అనుచరులు, ఆత్మీయులతో గుట్టుచప్పుడు కాకుండా సమాలోచనలు చేస్తున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.

ప్రధానంగా 4 నియోజకవర్గాల్లో..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. అన్ని సీట్లు సిట్టింగ్ ఎమ్మెల్యేలకే కేటాయించారు. ఇందులో పలువురు అభ్యర్థులపై అటు పార్టీలో, ఇటు ప్రజల్లో వ్యతిరేకత ఉన్నప్పటికీ వారికే బెర్త్ ఖరారు చేయడాన్ని ఆశావహులు జీర్ణించుకోలేకపోతున్నారు. పలు దఫాలుగా పార్టీ చేపట్టిన సర్వేల్లో తమకే గెలుపు అవకాశాలు ఉన్నాయని బహిర్గతమైందని.. ఆయా అభ్యర్థులు ఓడిపోతారని సైతం తేలిందని.. అయినా పార్టీ అధిష్టానం ఇవన్నీ పట్టించుకోలేదని టికెట్ ఆశించి భంగపడ్డ ఒకరిద్దరు నేతలు మథనపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ అసమ్మతుల ప్రభావం ప్రధానంగా అలంపూర్, కల్వకుర్తి, మక్తల్, అచ్చంపేట నియోజకవర్గాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాలు విశేషిస్తున్నాయి.

- మక్తల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికే బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వం ఖరారైంది. దీంతో ఈ స్థానం నుంచి ఈసారి తనకే బీఆర్‌ఎస్ టికెట్ వస్తుందనే ఆశతో ఉన్న వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథరెడ్డి గుర్రుగా ఉన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతున్న ఓ వీడియోను సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. తాను స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉండనున్నట్లు స్పష్టం చేశారు.

- కల్వకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మధ్య విభేదాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఈ సారి తనకే టికెట్ వస్తుందనే ధీమా కసిరెడ్డిలో వ్యక్తమైంది. అయితే రాష్ట్రంలో అత్యధిక స్థానాలు సిట్టింగ్‌లకే కేటాయించడం, సామాజిక కోణంలో మళ్లీ జైపాల్ యాదవ్‌కే పోటీ చేసే అవకాశం కల్పించారు. ఈ క్రమంలో కసిరెడ్డి వర్గీయులు హైదరాబాద్‌లో సమావేశమై ఈ సారి పోటీ చేయాల్సిందేనని ఆయనపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిసింది. స్వతంత్రంగా లేదా ఏదైనా పార్టీ నుంచి బరిలో నిలవాలని.. గెలుపు అవకాశం తమకే ఉన్నదని లెక్కలతో సహా చెబుతూ.. పార్టీలో ఎదుర్కొన్న అవమానాలను ఏకరువు పెట్టినట్లు సమాచారం.

- అచ్చంపేట ఎమ్మెల్యే టికెట్ మళ్లీ గువ్వల బాలరాజుకే ఖరారైంది. ఈ సారి ఎమ్మెల్యేగా తనకు లేదా తన కుమారుడికి వస్తుందని ఆశించిన నాగర్‌కర్నూల్ ఎంపీ రాములుకు భంగపాటే ఎదురైంది. దీంతో ఆయన అనుచరులు సీక్రెట్‌గా సమావేశమై చర్చించినట్లు పార్టీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

బుజ్జగింపుల దిశగా..

బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఖరారు తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తున్న పార్టీ అధిష్టానం చేపట్టాల్సిన చర్యలపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది. అసంతృప్తులను బుజ్జగించేలా సంప్రదింపులు చేపట్టా లని ఉమ్మడి జిల్లాలోని ముఖ్య నేతలకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లా లో పెద్దగా అసమ్మతి ప్రభావం లేదని.. ఎన్ని కలకు చాలా సమయం ఉందని.. త్వరలో అన్ని సర్దుకుంటాయని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఆచితూచి వ్యవహారం..

బీఆర్‌ఎస్‌లో టికెట్ ఆశించి భంగపడిన నేతలు ప్రస్తుతం రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. గెలుపోటములను బేరీజు వేసుకుంటూ.. తమ రాజకీయ భవితవ్యం దెబ్బతినకుండా ఆచితూచి వ్యవహరిస్తున్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు జై కొడుతూ.. అధిష్టాన నిర్ణయమే ఫైనల్ అని విధేయత ప్రకటిస్తూనే.. ముఖ్య నేతల వద్ద తమ ఆవేదనను వెళ్లగక్కుతున్నట్లు తెలిసింది.

ఎక్కడెక్కడ.. ఎలా అంటే..

- అలంపూర్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహంకు సీటు ఖరారు కాగా.. ఆయనపై ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి వర్గీయుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అబ్రహంకు టికెట్ ఖరారైన తర్వాత అభ్యర్థిని మార్చాలని అదే రోజు అలంపూర్ మండలం క్యాతూర్ సింగిల్ విండో చైర్మన్ రాఘవరెడ్డి సీఎం కేసీఆర్‌కు లేఖ రాసిన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం నియోజకవర్గానికి చెందిన చల్లా వర్గీయులు హైదరాబాద్‌లోని ఆయన ఇంటికి వెళ్లి సమాలోచనలు చేసినట్లు సమాచారం. పార్టీ అభ్యర్థిని మార్చాలని కోరుతూ సీఎం కేసీఆర్‌ను కలిసేలా ఆయనపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

ఆటో బోల్తాపడి మహిళ దుర్మరణం

అమ్రాబాద్: ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి ఓ మహిళ దుర్మరణం పాలైంది. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్తులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని లక్ష్మాపూర్(బీకే) గ్రామానికి చెందిన ఎర్ర పద్మమ్మ(42) తన భర్త మల్లయ్య, కుమారుడితో కలిసి మంగళవారం సాయంత్రం ఆటోలో కూరగాయలు తీసుకొని అమ్రాబాద్ వస్తున్నారు. మాధవానిపల్లి స్టేజీ సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ముందు కూర్చున్న పద్మమ్మ కిందపడగా ఆటో ఆమె మీదపడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను భర్త, స్థానికులు అమ్రాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పద్మమ్మకు భర్త మల్లయ్య, కుమారుడు ఉన్నాడు. పద్మమ్మ మృతితో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి.

పాఠశాల బస్సు కిందపడి చిన్నారి..


బబ్లూ (ఫైల్)

బల్మూర్: ప్రైవేట్ పాఠశాల బస్సు కిందపడి ఓ చిన్నారి దుర్మరణం పాలైంది. మండలంలోని జినుకుంటలో మంగళవారం చోటుచేసుకున్న ఈ విషాదకర సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీశైలం, మల్లీశ్వరి దంపతుల కుమారుడు తెలకపల్లిలోని శాంతినికేతన్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. అయితే పాఠశాల బస్సు సాయంత్రం విద్యార్థులను దించడానికి గ్రామానికి వచ్చింది. దీంతో రోజు మాదిరిగానే బస్సు దిగిన కుమారుడిని తల్లి మల్లీశ్వరి తీసుకురావడానికి వెళ్లగా ఆమెతో పాటు రెండో కుమారుడు బబ్లూ(4) సైతం వెళ్లాడు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో గమనించకుండా బస్సును ముందుకు తీయడంతో బబ్లూ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ అజాగ్రత్త వల్లే చిన్నారి మృతిచెందాడని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న అచ్చంపేట సీఐ అనుదీప్, ఎస్ఐ శేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చిన్నారి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

మహిళ బలవన్మరణం

జడ్చర్ల: మండలంలోని అంబటాపూర్ గ్రామానికి చెందిన శారద(30) సోమవారం ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిందని సీఐ రమేశ్‌బాబు తెలిపారు. ఈ ఘటనపై మంగళవారం శారద భర్త సుధాకర్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. ఆత్మహత్యకు గల కారణాలు విచారిస్తున్నామని పేర్కొన్నారు.

గాయపడిన ఉపాధ్యాయుడు మృతి


సులేమాన్ (ఫైల్)

కొల్లాపూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ పాఠశాల ఉపాధ్యాయుడు మృతిచెందాడు. మండలంలోని ఎల్లూరుకు చెందిన సులేమాన్(36) కొల్లాపూర్‌లోని శ్రీసత్యసాయి విద్యావిహార్ పాఠశాల ఉపాధ్యాయుడు, ట్రస్మా ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఇటీవల హైదరాబాద్ నుంచి కారులో వస్తుండగా అడ్డాకుల వద్ద ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. తీవ్రగాయాల పాలైన ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. యశోద, నిమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందగా పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతిచెందాడు. దీంతో మంగళవారం సులేమాన్ మృతదేహన్ని కొల్లాపూర్‌లోని సత్యసాయి విద్యావిహార్ పాఠశాల వద్దకు తీసుకురాగా.. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, రాజకీయ పార్టీల నాయకులు నివాళులర్పించారు. అనంతరం సులేమాన్ మృతదేహన్ని ఎల్లూరుకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. సులేమాన్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: పలువురికి ఛాయ్ విక్రయిస్తూ జీవనం సాగించే ఓ బాలుడు పట్టణంలో ఓ ఇంట్లో అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రాయిచూర్‌కు చెందిన ఎండీ షరియార్(16) పట్టణంలోని వీరన్నపేటలోని అమ్మమ్మ ఇంట్లో ఉంటూ న్యూటౌన్‌లో పండ్ల బండ్లు, దుకాణాల్లో ఛాయ్‌లు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటాడు. అయితే జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్ట శివాలయం వెనుకాలో ఓ ఇంట్లో సోమవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. న్యూటౌన్‌లో ఉన్న నయాబ్ హోటల్‌లో వేటర్‌గా పనిచేసే ఓ వ్యక్తి అద్దెకు ఉంటున్న గదిలో ఆ బాలుడి మృతదేహం లభించింది. సదరు వ్యక్తి ఎండీ షరియార్‌ను గదికి తీసుకెళ్లి కాళ్లు, చేతులు కట్టేసి సెక్స్‌వల్‌గా టార్చర్ చేయడంతోనే మృతిచెందాడన్నారు. స్థానికులు గుర్తించి ఆ వ్యక్తిని పట్టుకొని అతనిపై దాడి చేసి పోలీసులకు అప్పగించారు. అయితే ఈ వ్యక్తి గతంలో కూడా రైల్వే స్టేషన్ సమీపంలో ఓ బాలుడిపై కూడా సెక్స్‌వల్‌గా ఇబ్బంది పెట్టినట్లు తెలుస్తోంది. దీనిపై టూటౌన్ ఎస్ఐ సుజాతను వివరణ కోరగా మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, పీఎంఈ రిపోర్ట్ వచ్చిన తర్వాత నిర్ధారిస్తామన్నారు. ప్రస్తుతం అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు వెల్లడించారు.

తండాల్లో.. తీజోత్సవం


దుబ్బతండాలో మొలకలకు నీరు పోస్తున్న యువతులు



- మొదలైన మొలకల పండగ సందడి
- సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహణ
- మారుమూల ప్రాంతాల్లో అలరిస్తున్న ఉత్సవాలు
- నల్లమలలో గిరిజనుల కోలాహలం

అచ్చంపేట: నల్లమలలో లంబాడా గిరిజనుల(బంజారాలు) సంప్రదాయ మొలకల పండుగను ఉత్సవంగా జరుపుకొంటున్నారు. ఈ వేడుకులను రాష్ట్రంలోనే నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రత్యేకంగా నిర్వహించడం విశేషం. ఆరేళ్ల క్రితం ప్రభుత్వం ఈ ఉత్సవాలకు గుర్తింపునిచ్చింది. పెళ్లి కాని లంబాడా యువతులు సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ శ్రావణమాసంలో వేడుకలు జరుపుకొంటారు. ప్రతి తండాలో రెండు, మూడేళ్లకోసారి ఈ మొలకల పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. జిల్లాలోని అచ్చంపేట, ఉప్పునుంతల, బల్మూర్, లింగాల, అమ్రాబాద్, పదర ఏజెన్సీ తండాలతోపాటు వంగూరు, చారకొండ, కల్వకుర్తి, ఆమనగల్ మండలాల్లో మొలకల పండుగ జరుపుతారు. అచ్చంపేట మండలం గుంపన్‌పల్లి, దుబ్బతండా, కేశ్యతండా, మర్లపాడుతండా, ఎద్దుమిట్టతండా, దేవులతండా, బక్కలింగాయిపల్లి, ఐనోలు తండాల్లో తీజ్ ఉత్సవాలు మొదలయ్యాయి. సేవాలాల్ మహారాజ్ (సేవాబాయి), దండి మేరమ్మ (అమ్మవారు) పూజ, భజన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు.

రేగిచెట్టుకు పూజలు చేసి..

పెళ్లికాని యువతులు రేగిచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి తీజ్ వేడుకలను ప్రారంభిస్తారు. అంతకు ముందే తండాల్లోని పెద్దలు ప్రతి ఇంటి నుంచి గోదుమలు సేకరించి రోజంతా నీళ్లలో నానబెడుతారు. పెళ్లికాని యువతులు చిన్న చిన్న వెదురు బుట్టలో పుట్టమన్ను (మకొడధూడ్) గోవు పిడకల చూర్ణాన్ని కలిపి నాయక్ (పూజారి) ఇంటికి తీసుకురాగా నాయక్ భార్య ఆ బుట్టలో నానబెట్టిన గోదుమలు వేసి అలుకుతుంది. అనంతరం పూజలు చేసి బుట్టలను డాగ్లో (మంచెలాంటి)పై ఉంచి తొమ్మిది రోజులపాటు ప్రత్యేక జలాలు చల్లుతూ ఉత్సవాలు నిర్వహిస్తారు.

పులియోగెనో..

తీజ్ ఉత్సవంలో ముఖ్యమైనది పులియోగెనోది. దీనిని బంజారా మహిళలు స్వయంగా తయారు చేస్తారు. అద్దాలు, గవ్వలు, పూసలతో చూడముచ్చటగా తయారు చేయడానికి తమ స్థోమతను బట్టి రూ.2 వేల వరకు ఖర్చు చేస్తారు. గోదుమలు మొలకెత్తడానికి పవిత్ర జలాలు పోసే సమయంలో తీజ్ ఉత్సవం నిర్వహించేటప్పుడు దీనిని వినియోగిస్తారు. యువతులు కలశాలతో జలాలు తీసుకొచ్చేటప్పుడు తలపై పెట్టుకునే దానిని గెనో అని రెండు కళశాలపై కప్పుకుని వచ్చే దానిని పులియా అని వ్యవహరిస్తారు. పెళ్లి సమయంలో దీనిని పెళ్లికూతురుకు తమ గుర్తుగా తల్లిదండ్రులు అందిస్తారు. గిరిజనుల సంప్రదాయం, సంస్కృతికి పులియోగోనో అతి ముఖ్యమైనది.

ఏడుగురు దేవతలు..

లంబడా తెగ గిరిజనులకు ఏడుగురు స్త్రీ దేవతలు ఉన్నారు. మెరామ, హింగళ, తుల్జా, కేంకాళి, తీజ్, మత్రాళ్, సీత్ల అనే దేవతల పేర్ల మీదుగా నిర్వహించే ప్రధాన పండుగలు. మెరామ దేవత తండాను రక్షిస్తే, తీజ్ దేవత పంటలను కాపాడుతుందని నమ్ముతారు. సీత్ల దేవత పశు సంపదను వృద్ధి చేస్తుందని, మత్రాళ్ దేవత పిల్లలు అంటువ్యాధుల బారిన పడకుండా రక్షిస్తుందని విశ్వసిస్తారు. వివిధ ప్రాంతాల్లో ఉండే బంధువులంతా పండుగల సందర్భంగా కలుసుకొని ఆత్మీయ, అనురాగాలు పంచుకుంటారు. యుక్త వయస్సు ఉన్న గిరిజన యువతులు విద్య, ఉద్యోగ, సంసారిక జీవితంతోపాటు పుట్టినిళ్లు, మెట్టినిల్లు కూడా అష్టైశ్వర్యాలు, సుఖశాంతులతో తుల తూగాలని ప్రతిఏటా మొలకల పండుగ నిర్వహిస్తారు.

ముగింపు వేడుకల్లో..

తీజ్ ముగింపు ఉత్సవాల్లో పాల్గొనే పెళ్లికాని యువతులు వచ్చే ఏడాది తాము తీజ్ ఆడతామో.. లేదోననే ఆందోళన కనిపిస్తోంది. అంతకు ముందు గ్రామంలో పెళ్లి కాని గిరిజన యువకులు చేతుల్లో పట్టుకునే పీడీయాను ప్రయత్నాలు చేస్తూ విడిపిస్తారు. అయితే పీడీయా పట్టుకున్న వ్యక్తి ఇంటి పేరు విడిపించే యువతుల ఇంటి పేర్లు ఒక్కటి కాకుండా జాగ్రత్తలు తీసుకుంటారు.

పండుగ విశిష్టత..

తీజ్ పండగను గిరిజనులు తొమ్మిది రోజులపాటు జరుపుకొంటారు. ఆయా రోజుల్లో యువతులు రొట్టెలు, ఆకుకూరలు మాత్రమే ఆహారంగా తీసుకుంటారు. బుట్టలు ఎందరు ఉంచినా అందులో ఐదుగురు యువతులు మాత్రమే నిష్టతో పూజ చేస్తారు. చివరిరోజు యువతులు మొలకల బుట్టలను తలపై పెట్టుకొని చెరువు వద్దకు వెళ్తారు. అప్పటికే అక్కడ సంప్రదాయ పద్ధతిలో రుమాలు తలకు చుట్టుకొని పెద్దమనషులు కూర్చుంటారు. యువతులు బుట్టల్లోని కొన్ని మొలకలను తలపాగాల్లో వేస్తారు. అనంతరం బుట్టలకు పూజలు చేసి చెరువులోకి వదులతారు. తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత పెద్దమనషుల కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకుంటారు. యువతులను సైతం పీటలపై కూర్చోబెట్టి పెద్దమనషులు వారి కాళ్లు కడిగి ఆశీర్వదిస్తారు.

పీయూలో ఎక్స్‌టెన్షన్ లెక్చర్


అధ్యాపకులను సన్మానిస్తున్న పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో సోషల్ సైన్స్ విద్యార్థులకు 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఆన్ సోషల్ సైన్స్ అండ్ కెరియర్ ప్రాస్పెక్ట్ ఇన్ ఇండియా అన్ బియాండ్' అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అమెరికాలో యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ అధ్యాపకులు సుదర్శన్ పసుపులేటి, సుశీల శ్రీనివాస్‌లను హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్య అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే భాషానైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలంటే వర్కింగ్ స్కిల్స్ సైతం పెంచుకోవాలని సూచించారు. పట్టుదల, నిరంతర శ్రమతో జీవితంలో విద్యార్థులు ముందుకెళ్తారన్నారు. పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ మాట్లాడుతూ అంతర్జాతీయ గుర్తింపు ఉన్న టెక్సాస్ యూనివర్సిటీతో ఎంఓయూ కుదుర్చుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ గిరిజ, అధ్యాపకులు మధుసూదన్‌రెడ్డి, కుమరస్వామి, పర్వతాలు, గాలెన్న, భూమయ్య, చంద్రశేఖర్, సోమేశ్వర్, జిమ్మీకార్టన్ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు మంగళవారం సాయంత్రం 1,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ఒక పంపు ద్వారా 750 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఆవిరి రూపంలో 89 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1 ద్వారా 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 718 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 100 క్యూసెక్కులు, ప్రాజెక్టు నుంచి మొత్తం 3,552 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా 7.798 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది.

కోయిల్‌సాగర్ నీటిమట్టం 27.4 అడుగులు

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో మంగళవారం సాయంత్రం వరకు 27.4 అడుగులకు నీటి మట్టం చేరింది. జూరాల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా 315 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా వానాకాలం పంటలకు నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. మరో 5.2 అడుగుల నీరు చేరితే ప్రాజెక్టు గేట్లను తెరిచే అవకాశం ఉంది.

శ్రీశైలంలో 858 అడుగుల నీటిమట్టం..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం 858.0 అడుగుల నీటిమట్టం, 99.9810 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 8,000, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 490, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్ఎస్ఎస్‌కు 2,025, రేగుమాన్ గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 800 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 8.908 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 17,032 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు వదిలారు.

బంతిలో సస్యరక్షణ చర్యలు కీలకం


బంతి నారును సూడోమోనాస్ అనే శిలింద్ర ద్రావణంలో ముంచి నాటిస్తున్న ప్రొఫెసర్లు

బిజినేపల్లి: బంతి తోట పెంపకానికి ఇప్పుడు అనువైన సమయమని, ఈ బంతి నారు పెంపకం, నాటడంతో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని పాలెం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.పుష్పావతి అన్నారు. మంగళవారం మండలంలోని పాలెం వ్యవసాయ కళాశాల దత్తత గ్రామం గంగారంలో నార్య, ఆంజనేయులు అనే రైతులకు ఉచితంగా బంతి నారును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా.పుష్పావతి మాట్లాడారు. బంతి నారు నాటే ముందు రైతులు సూడోమోనాస్ అనే శిలీంద్ర ద్రావణంలో వేర్లను ముంచి నాటాలని సూచించారు. ఇలా చేయడంతో వేరు ద్వారా కాని, నేల ద్వారా సంక్రమించే తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకోవచ్చని సూచించారు. అంతేకాక గ్రామంలో పత్తి, బెండ, మిరప పంటలను సందర్శించి వాటికి సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుమలత, అసోసియేట్ ప్రొఫెసర్ భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల అపహరణ

జడ్చర్ల: మండలంలోని బూరెడ్డిపల్లి శివారులో జాతీయ రహదారిని అనుసరించి నిర్వహిస్తున్న ఓ దాబాలో ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. సోమవారం మధ్యాహ్నం భోజనం చేసేందుకు రమేశ్‌జీ అనే వ్యక్తి తన బైక్‌ను దాబా ఎదుట నిలిపి భోజనం చేస్తుండగా దాబాలో పనిచేసే ఓ వ్యక్తి బైక్‌ను అపహరించుకెళ్లాడు. అలాగే దాబాలో పనిచేస్తున్న ఓ మహిళ మొబైల్ ఫోన్‌ను సైత తీసుకెళ్లాడు. స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర రఫీయొద్దీన్‌కు చెందిన బైక్‌ను సైతం చోరీ చేయడంతో బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు.

పాన్ షాప్‌లో..

పట్టణంలోని నేతాజీ చౌరస్తాలో గల గోపాలకృష్ణ పాన్‌షాప్‌లో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. పాన్ షాప్ తాళాలు విరగ్గొట్టి షాప్‌లో ఉన్న సిగరెట్లు ఇతర వస్తువులను అపహరించారు. చోరీ అయిన సొత్తు విలువ దాదాపు రూ.6 వేలు ఉంటుందని బాధితుడు సలావుద్దీన్ మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

నేరాల నియంత్రణకు నాకాబందీ


జిల్లా కేంద్రంలోని పాన్‌గల్ రోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

వనపర్తి: నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పర్యవేక్షణకు మంగళవారం రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు ఏక కాలంలో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నాకాబందీ(వాహన తనిఖీలు) నిర్వహించామని డీఎస్పీ ఆనంద్‌రెడ్డి వెల్లడించారు. నాకాబందీలో జిల్లా వ్యాప్తంగా రెండు గంటల వ్యవధిలోనే.. 24 డ్రంకెన్‌డ్రైవ్, 89 ఆర్‌సీ పత్రాలు లేని వాహనాలు, 75 నంబర్ ప్లేట్లు లేనివి, 19 త్రిబుల్ రైడింగ్, 89 హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేస్తున్న ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సీజ్ చేసిన వాహనాలను సంబంధిత పోలీస్‌స్టేషన్లలో ఉంచామని, బుధవారం ఒరిజినల్ ఆర్‌సీ పత్రాలు చూపించి తీసుకెళ్లవచ్చన్నారు. ఇకపై ప్రతిరోజూ.. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తామన్నారు. ఈ నాకాబందీతో కొత్త వ్యక్తులు మన ప్రాంతానికి వచ్చే విషయం తెలుస్తుందన్నారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో పాన్‌గల్ రోడ్డులోని ఫారీద్ రైస్‌మిల్ వద్ద పోలీసులు నాకాబంది నిర్వహించారు.

అధికారులకు నెమలి అప్పగింత



చిన్నచింతకుంట: మండలంలోని లాల్‌కోటలో మంగళవారం ఓ నెమలికి గాయమై వ్యవసాయ పొలంలో తిరుగుతుండగా రైతు మఠం రాజు పట్టుకొని అటవీ అధికారులకు అప్పగించారు. ఫారెస్ట్ అధికారి నవీన్‌రాజు నెమలిని స్వాధీనం చేసుకుని చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ తీసుకెళ్లారు

జిల్లాకు రెండు జూనియర్ కళాశాలలు


మహ్మదాబాద్‌లో కళాశాల ఏర్పాటుపై అధికారులతో చర్చిస్తున్న డీఐఈఓ వెంకటేశ్వర్లు తదితరులు

- మహ్మదాబాద్, చిన్నచింతకుంటలో ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ
- ఈ విద్యాసంవత్సరం తాత్కాలికంగా మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం
- 31 వరకు చేరేందుకు అవకాశం
- ఒక్కో కోర్సులో 40 నుంచి 80 వరకు సీట్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా రెండు కొత్త జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. కొన్ని సంవత్సరాలుగా కొత్త కళాశాలల ఏర్పాటు లేకపోవడంతో పలు చోట్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం గతంలో పంపించిన ప్రతిపాదనల ఆధారంగా నూతనంగా రెండు కొత్త కళాశాలలను మంజూరు చేసింది. అందులో భాగంగా జిల్లాలోని మహ్మదాబాద్ మండల కేంద్రంలో ఒకటి, చిన్నచింతకుంట మండల కేంద్రంలో మరొకటి ఏర్పాటు చేయనున్నారు. అయితే ప్రభుత్వం వీటి ఏర్పాటుకు ప్రత్యేకంగా కళాశాల భవనం సదుపాయాలు కల్పించలేదు. దీంతో అధికారులు సంబంధిత మండల కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలు, హైస్కూల్స్, జిల్లా పరిషత్‌కు సంబంధించి భవనాలను పరిశీలిస్తున్నారు. అందులో భాగంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు జిల్లాలోని మహ్మదాబాద్‌లో ఓ ప్రభుత్వ భవనాన్ని మంగళవారం తనిఖీలు చేశారు. అయితే ఏర్పాటు కొత్త ఇంటర్ కళాశాలల్లో అడ్మిషన్లు చేపట్టేందుకు ఈ నెల 31 వరకు అధికారులు సమయం కేటాయించారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

ఒక్కో కళాశాలలో నాలుగు కోర్సులు...

నూతనంగా ప్రారంభించే కళాశాలలో నాలుగు కొత్త కోర్సులతో కళాశాలను ప్రారంభించనున్నారు. అందులో భాగంగా హెచ్‌ఈసీ, ఎంపీసీబైసీ, ఎంపీసీ, సీఈసీ కోర్సులను ప్రారంభించనున్నారు. ఒక్క కోర్సులో 40 నుంచి 80 వరకు కూడా సీట్లను భర్తీ చేసేందుకు అవకాశం ఉంది. కళాశాలను ప్రారంభించేందుకు ప్రస్తుతం ఇన్‌చార్జ్‌ని సీనియర్ లెక్చరర్ల, సీనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, అటెండర్, డిప్యుటేషన్‌పై పంపిచేందుకు అధికారులు సిద్ధమవుతన్నారు. అక్కడ ఉన్న అడ్మిషన్ల ఆధారంగా కొత్తగా వివిధ సబ్జెక్టుల అధ్యాపకలను కూడా పంపించనున్నారు.

ఎస్సెస్సీ చదివే విద్యార్థుల ఆధారంగా..

ఆయా మండలాల్లో ఎస్సెస్సీ చదివే విద్యార్థులు, ఇంటర్‌లోకి ప్రవేశించే విద్యార్థుల సంఖ్యను ఆధారంగా తీసుకుని వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 13 ప్రభుత్వ ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. మొత్తం 4 ఇంటర్ కళాశాలలు ఒక్క జిల్లా కేంద్రంలోనే ఉన్నాయి. అయితే కొన్ని మండల కేంద్రాల్లో దగ్గరగా కళాశాలలు లేకపోవడంతో జిల్లా కేంద్రంలోని బాలికల, బాలుర జూనియర్ కళాశాలలపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతుంది. ఒక్క బాలికల జూనియర్ కళాశాలలోనే దాదాపు 2,400 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ క్రమం వీటిపై ఒత్తిడిని తగ్గించి స్థానికంగా చదువులు అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తుంది.

దరఖాస్తులు చేసుకోవాలి...

జిల్లాలో రెండు మండలాల్లో కొత్త జూనియర్ కళాశాలలకు అనుమతి ఇచ్చింది. ఇందుకు సంబంధించి స్థానికంగా ప్రభుత్వ భవనాల్లో కళాశాలను ఏర్పాటు చేయనున్నాం. సిబ్బంది కూడా నియమిస్తాం. ఈ నెల 31లోగా అక్కడే విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలి.

– వెంకటేశ్వర్లు, డీఐఈఓ

పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎస్పీ కె.నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో నమోదైన పోక్సో, ఎస్సీ, ఎస్టీ, గ్రేవ్ కేసుల పరిశోధన త్వరితగతిన పూర్తిచేయడంలో ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ కె.నరసింహ అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ కట్టడి చేయాలన్నారు. నేరాలను సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని, ప్రతిరోజూ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే కార్యక్రమం ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పేలుడు పదార్థాలు అక్రమ నిల్వలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వర్టికల్స్‌లో ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన పలువురు ఎస్ఐలకు, సిబ్బందికి ఎస్పీ రివార్డ్స్ అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీలు రాములు, సురేష్ కుమార్, డీఎస్పీలు టి.మహేష్, రమణారెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాసులు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలుశిక్ష

గద్వాల క్రైం: హత్యాయత్నం కేసులో నిందితుడికి అయిదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్పీ సృజన, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకట్రాములు తెలిపారు. ఇటిక్యాల మండలం షాబాద్‌కి చెందిన దేవకుమార్‌పై అదే గ్రామానికి చెందిన నాగరాజు 2021లో పాత గొడవలను మనస్సులో పెట్టుకుని కిరాణ షాపు వద్ద ఉండగా ఎరుకలి కొడవలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయమై ఇటిక్యాల పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని నాగరాజును రిమాండ్‌కు తరలించారు. మంగళవారం గద్వాల కోర్టు అదనపు సీనియర్ సివిల్ జడ్జి ప్రభాకర్ కేసు వాదనలు, పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నిందితుడికి అయిదు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు చెప్పారు. శిక్ష పడేలా చర్యలు తీసుకున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

వ్యక్తిపై కేసు నమోదు

పాన్‌గల్: ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వేణు వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఇండియన్ గ్యాస్ గోదాం యజమాని ఈశ్వర్‌జీ ఈనెల 19న విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఇండియన్ గ్యాస్ ముందు రోడ్డుపై వాకింగ్ చేస్తుండగా, వెనుక నుంచి ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో అదేరోజు చికిత్స నిమిత్తం జిల్లా ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. బాధితుని కూతురు దివ్య మంగళవారం ఫిర్యాదు చేయడంతో ద్విచక్ర వాహనం నడిపిన రాంబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్టీ గురుకులాల్లో 15 గెస్టు అధ్యాపక పోస్టులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ ఎస్టీ గురుకులాల్లో ఉన్న గెస్టు అధ్యాపక పోస్టులు భర్తీ చేయనున్నట్లు ఆర్సీఓ నాగార్జున రావు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 15 పోస్టులు ఉండగా వీటికి ఆసక్తి గల అధ్యాపకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 25న జిల్లాకేంద్రంలోని తిరుమలహిల్స్‌లో ఉన్న ఆర్సీఓ కార్యాలయంలో డెమో నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు హాజరుకావాలని, మరింత సమాచారం కోసం 79010 99784, 94411 61156లకు ఫోన్ చేయాలని సూచించారు.

‘మార్గదర్శి’లో చేరాం.. మోసపోయాం!

▶ మొదటి పేజీ తరువాయి

మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే మూడు కేసుల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై సీఐడీ కేసులను నమోదు చేసి బ్రాంచి మేనేజర్లను అరెస్టు చేసింది. మరోవైపు రాష్ట్రంలో నలుమూలల నుంచి మార్గదర్శి చందాదారులు పెద్ద ఎత్తున సీఐడీకి ఫిర్యాదులు చేస్తున్నారు. ఒక్కో చందాదారుడిది ఒక్కో వ్యథ!

మూడు రోజుల్లో 300కిపైగా ఫిర్యాదులు

మోసపోయిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు ఫిర్యాదు చేసేందుకు సీఐడీ విభాగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. చందాదారులు ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేకంగా వాట్సాప్ నంబరు (9493174065) అందుబాటులోకి తెచ్చింది. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మార్గదర్శి చందాదారులు పెద్ద సంఖ్యలో సీఐడీకి ఫిర్యాదు చేస్తున్నారు. వాట్సాప్ నంబర్ అందుబాటులోకి రాక ముందు సీఐడీకి దాదాపు వందకుపైగా ఫిర్యాదులు రాగా ఇప్పుడు మూడు రోజుల్లోనే మూడు వందల మందికి పైగా చందాదారులు ఫిర్యాదు చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. చందాదారులు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తుండటంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ మోసాల చిట్టా అంతకంతకూ పెరుగుతోంది.

చందాదారుల సొమ్ము సొంతానికి... మార్గదర్శి దివాళా అంచుకు

కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ రామోజీరావు పాల్పడిన ఆర్థిక అక్రమాలతో చందాదారులు నిండా మోసపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల సొమ్మును రామోజీరావు నిబంధనలకు విరుద్ధంగా తమ సొంత వ్యాపార సంస్థలైన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఉషోదయ ఎంటర్‌ప్రైజస్‌లలో పెట్టుబడిగా పెట్టారు. మరికొన్ని నిధులను మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులుగా తరలించేశారు. దాదాపు 2 వేలకుపైగా ఉన్న చిట్టీ గ్రూపుల చందాదారులు చెల్లించే చందా మొత్తంలో కొంత మొత్తాన్ని అటూ ఇటూ రొటేషన్ చేస్తూ దశాబ్దాలుగా మోసం చేస్తూ వచ్చారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాలు బయటపడటంతో 2022 నవంబరు నుంచి కొత్త చిట్టీలు నిలిచిపోయాయి. మరోవైపు భారీగా చందాదారుల సొమ్మును రామోజీ తమ పేరిట స్థిర, చరాస్తులుగా మార్చేశారు. దీంతో ప్రస్తుతం చిట్టీ గ్రూపుల్లో ఉన్న దాదాపు 50 వేల మంది చందాదారులకు ప్రైజ్‌మనీని చెల్లించలేక మార్గదర్శి చిట్‌ఫండ్స్ చేతులెత్తేసింది. రాష్ట్రంలోని 37 బ్రాంచీల పరిధిలో దాదాపు 1,300 మంది చందాదారులకు 9 నెలలుగా ప్రైజ్ మనీ చెల్లించడం లేదని సమాచారం. గత 9 నెలల్లో రూ.1,620 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయని సీఐడీ అధికారులు గుర్తించినట్టు తెలిసింది. మరోవైపు రశీదు రూపంలో సేకరించిన అక్రమ డిపాజిట్ల మొత్తాన్ని కూడా కాల పరిమితి ముగిసినా చెల్లించడం లేదు. వెరసి దాదాపు రూ.2 వేల కోట్ల వరకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బకాయి పడిందని సీఐడీ అధికారుల సోదాల్లో వెల్లడైనట్లు సమాచారం.



సీఐడీ సత్వర స్పందన

చందాదారుల ఫిర్యాదుపై సీఐడీ విభాగం సత్వరం స్పందిస్తోంది. ఫిర్యాదులో వాస్తవాలు ఉన్నాయని నిర్ధారణ కాగానే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతోంది. ఇప్పటికే మూడు కేసుల్లో మార్గదర్శి బ్రాంచి మేనేజర్లను అరెస్టు చేసింది. ‘ఘోస్ట్’ చందాదారుడి పేరిట భారీ అక్రమ దందాకు పాల్పడిన కేసులో చీరాల మార్గదర్శి బ్రాంచి మేనేజర్‌కు న్యాయస్థానం రిమాండ్ విధించింది.

సీఐడీకి మార్గదర్శి చందాదారుల ఫిర్యాదుల్లో కొన్ని

- విజయనగరంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుడు ఒకరు మొత్తం రూ.6 లక్షలు విలువైన నాలుగు చిట్టీ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయన చిట్టీ పాట పాడి రెండు ఎల్ఐసీ బాండ్లను ష్యూరిటీగా సమర్పించారు. రూ.5 లక్షలు, రూ.2 లక్షలు విలువైన రెండు బాండ్లను ష్యూరిటీగా ఇచ్చారు. ఆ చిట్టీ గ్రూపుల కాలపరిమితి ముగిసి నెలలు గడుస్తున్నా ఆయనకు ఎల్ఐసీ బాండ్లను తిరిగి ఇవ్వడంలేదు. దీనిపై సంబంధిత బ్రాంచి మేనేజర్‌ను ఎన్నిసార్లు కలిసినా అరణ్య రోదనగానే మారింది.
- విశాఖపట్నంలో ఒక చందాదారుడు రూ.40 లక్షల చిట్టీ గ్రూపులో సభ్యుడిగా చేరారు. 20 నెలలు వాయిదాలు చెల్లించిన తరువాత రూ.8 లక్షల నష్టానికి అంటే రూ.32 లక్షలకు చిట్టీ పాడారు. కానీ ఏడాదిన్నర అవుతున్నా ఇంత వరకు ఆయనకు చిట్టీపాట మొత్తం చెల్లించడం లేదు. దీనిపై బ్రాంచి మేనేజర్ సరైన సమాధానం చెప్పడం లేదు. ఎందుకంటే ఆ చిట్టీగ్రూపులో పెద్ద సంఖ్యలో నకిలీ చందాదారులు ఉన్నట్టు తెలిసింది. ఆ వాయిదాల ను మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం చెల్లించడం లేదని చందాదారుడికి తెలిసింది. దీనిపై బ్రాంచి మేనేజర్‌ను ప్రశ్నించగా.. నీకు దిక్కున చోట చెప్పుకో, చిట్టీ మొత్తం ఇవ్వలేమని చెప్పడంతో చందాదారుడు నిర్ఘాంతపోయాడు.
- బాపట్లలో రూ.5 లక్షల చిట్టీ గ్రూపులో ఒకరు సభ్యుడిగా చేరారు. కొన్నినెలలు పాటు రూ.40 వేలు వాయిదాలు చెల్లించిన తరువాత ఆయన గ్రూప్ నుంచి వైదొలిగారు. ఆయన స్థానంలో మరొకరిని చందాదారుడిగా చేర్చారు. ప్రత్యామ్నాయ చందాదారుడిని చేర్చుకున్న తరువాత వైదొలగిన చందాదారునికి అప్పటికే చెల్లించిన వాయిదాల మొత్తాన్ని తిరిగి చెల్లించాలి. కానీ ఆ మొత్తం వెనక్కి ఇవ్వడం లేదు. దీనిపై బ్రాంచి మేనేజర్‌ను ప్రశ్నించగా చందాదారుడే తిరిగి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు రూ.25 వేలు చెల్లించాలని దబాయిస్తున్నారు.
- వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఒకరు నాలుగు చిట్ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయన చందా వాయిదా చెల్లించడం ఒక్క రోజు ఆలస్యమైనా రోజుకు రూ.500 చొప్పున జరిమానా వసూలు చేశారు. ఆ చందాదారుడు ఓ చిట్టీ గ్రూపులో పాట పాడి మూడు నెలలు దాటినా ప్రైజ్‌మనీ ఇవ్వడం లేదు. నిబంధనల మేరకు ష్యూరిటీలు సమర్పించినా ఆమోదించడం లేదు. దీనిపై సంబంధిత బ్రాంచి మేనేజర్‌ను ప్రశ్నించగా కంపెనీలో ప్రస్తుతం డబ్బులు లేవని అనధికారికంగా చెప్పడంతో చందాదారుడు నిర్ఘాంతపోయారు.
- విశాఖలో మరో చందాదారుడు రూ.5 లక్షలు చిట్ గ్రూపులో చేరి 38 నెలలు సక్రమంగా వాయిదాలు చెల్లించారు. తన కుమారుడి చదువు కోసం చిట్టీ పాడేందుకు వెళ్లగా ఆయన పాడేసి డబ్బులు తీసేసుకున్నట్టు రికార్డుల్లో కనిపించింది. ఆయన పేరుతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యమే పాట పాడేసి డబ్బులు తీసేసుకున్నట్లు తెలిసింది.

అదో విష వలయం.!

- మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ చందాదారులను పక్కా పన్నాగంతో అష్టదిగ్బంధనం చేస్తోంది. వారిని శాశ్వత రుణగ్రహీతలుగా మార్చేస్తూ వారి సంపాదననే కాకుండా ఆస్తులను కూడా కాజేస్తోంది. కొందరు చందాదారులను అనధికారికంగా పలు చిట్టీ గ్రూపుల్లో సభ్యులుగా చేరుస్తోంది. ఆ విషవలయం నుంచి తప్పించుకోవడం చందాదారుల తరం కావడం లేదు. ఓ బాధితుడు సీఐడీకి ఫిర్యాదు చేయడంతో మార్గదర్శి అక్రమాల బాగోతం బయటపడింది.
- ఓ చందాదారుడు మొత్తం రూ.4.72 కోట్ల విలువైన చిట్టీ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయన రూ.3.33 కోట్ల విలువకు చిట్టీ పాటలు పాడారు. అంటే ఆయనకు రూ.3.33 కోట్లు చిట్టీ పాటల మొత్తం (ప్రైజ్‌మనీ)గా రావాలి. కానీ ఆయనకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ చేతిలో పెట్టింది ఎంతో తెలుసా?
- కేవలం రూ.23లక్షలు. నివ్వెరపోయినచ ఆయన ఇదేమిటని ప్రశ్నిస్తే.. ఆ చందాదారుడికి తెలియకుండా ఆయన్ను ఎందరో చందాదారులకు ష్యూరిటీదారుడిగా నమోదు చేసేశారు. గతంలో ఆయనతో ఖాళీ కాగితాలపై తీసుకున్న సంతకాలతోపాటు మరికొన్ని సంతకాలను ఫోర్జరీ చేసి ఇరికించారు.
- ఆయన 65 చిట్టీ గ్రూపుల్లో సభ్యుడిగా చేరితే మార్గదర్శి రికార్డుల్లో మాత్రం 90 గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నట్లు నమోదు చేశారు. అంటే ఆయన సభ్యుడిగా చేరని 25 చిట్టీ గ్రూపులకు కూడా బకాయి ఉన్నట్టుగా చూపిస్తూ ప్రైజ్‌మనీలో కోత విధించారు. దీనిపై ఆ చందాదారుడు సీఐడీకి ఫిర్యాదు చేశారు.

ఇప్పటికే నమోదైన 3 కేసులివీ...

- సూళ్లూరుపేటకు చెందిన సుబ్రహ్మణ్యానికి తెలియకుండా ఆయన్ను చీరాలలో చందాదారుడిగా చేర్చారు. బుక్ అడ్జస్ట్‌మెంట్ల ద్వారా ఆయన చందా చెల్లించినట్టు కనికట్టు చేశారు. ఆయన పేరిట ప్రతి నెల డివిడెండ్‌తోపాటు ఒక నెల ప్రైజ్‌మనీ మొత్తాన్ని కూడా మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ ఖాతాలో వేసుకుంది. అంటే ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే డివిడెండ్లు, ప్రైజ్‌మనీ కొల్లగొట్టి ఇతర చందాదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించింది. తమ ఆధార్ కార్డును దుర్వినియోగంచేయడంతోపాటు తమకు తెలియకుండా చందాదారుడిగా చేర్చడంపై బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు చీరాల పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం మార్గదర్శి చీరాల శాఖ మేనేజర్ సురేంద్రను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.
- అనకాపల్లికి చెందిన బి.వెంకటేశ్వరరావు నెలకు రూ.10 వేలు చొప్పున చందా చెల్లిస్తూ చిట్టీ గ్రూపులో చేరారు. 50 నెలల చందాలు చెల్లించిన తరువాత రూ.4,61,989కు చిట్టీ పాట పాడారు. ఆయన ఎన్నిసార్లు చిట్‌ఫండ్స్ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రైజ్‌మనీ ఇవ్వలేదు. ఎట్టకేలకు ఆయనకు రూ.20 మాత్రమే వస్తుందని చెప్పారు. మిగిలిన మొత్తాన్ని ఆయన ష్యూరిటీ ఇచ్చిన చిట్టీల్లో సర్దుబాటు చేసినట్టు చూపారు. అసలు తాను ఎవరికీ ష్యూరిటీ ఇవ్వలేదని ఆయన మొత్తుకున్నా బ్రాంచి మేనేజర్ వినిపించుకోలేదు. ఆయన సంతకాలు ఫోర్జరీ చేసిన పత్రాలను చూపించి బెదిరించారు. ఆ కాపీలు ఇచ్చేందుకు ససేమిరా అన్నారు. వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.
- కోరుకొండ విజయ్‌కుమార్ అనే చందాదారుడు మార్గదర్శి చిట్‌ఫండ్స్ రాజమహేంద్రవరం బ్రాంచిలో రూ.5 లక్షల చిట్టీ గ్రూపులో చేరారు. కొన్ని వాయిదాలు చెల్లించిన తరువాత 2020 జూన్‌లో రూ.3 లక్షలకు చిట్టీ పాట పాడారు. కానీ ఆయనకు ప్రైజ్‌మనీ ఇచ్చేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్ నిరాకరించారు. విజయ్‌కుమార్ తన స్నేహితుడు మల్లికార్జునరావుకు 2019లో ష్యూరిటీ ఇచ్చారని, ఆ స్నేహితుడు వాయిదాలు చెల్లించడం లేదు కాబట్టి ప్రైజ్‌మనీ ఇవ్వలేమని చెప్పారు. నిజానికి మల్లికార్జునరావు చిట్టీ గడువు అప్పటికే తీరిపోయింది. తనను మార్గదర్శి యాజమాన్యం మోసం చేసిందని విజయ్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

లోకేశ్‌తో నాకు ప్రాణహాని

ఇదే నా మరణ వాంగ్మూలం

- నాపై పరువు నష్టం దావా అందుకే వేశారు
- మంగళగిరి కోర్టుకు వెళ్లి వచ్చే సమయంలో హతమార్చాలని కుట్ర పన్నారు
- నేను చనిపోతే దానికి కారణం లోకేశే
- కంతేరులో హెరిటేజ్ పేరిట భూములు కొన్నది వాస్తవం కాదా?
- లోకేశ్‌కు తెలీకుండానే ఆయన తల్లి, భార్య భూములు కొన్నారా?
- వాళ్ల కుటుంబ సభ్యుల ఆస్తులతో లోకేశ్‌కు సంబంధం లేదా?
- నిత్యం బూతులు మాట్లాడే లోకేశ్‌పై నేను పరువునష్టం దావా వేస్తే 20 ఏళ్లు జైల్లో ఉండాలి
- ఏపీలోని నా ఆస్తి మొత్తం పేదలకు ఇచ్చేస్తా.. రాజధాని రైతులు స్టే వెనక్కి తీసుకోవాలి
- మీడియాతో పోసాని కృష్ణమురళి

సాక్షి, అమరావతి : టీడీపీ నేత నారా లోకేశ్ నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర, టీవీ, నాటక రంగాభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి తీవ్ర ఆరోపణ చేశారు. అందుకోసమే తనపై పురునష్టం దావా వేశారని.. ఈ కేసులో మంగళగిరి కోర్టుకు వెళ్లివచ్చే సమయంలో తనను హత్య చేసేందుకు కుట్ర పన్నారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను చనిపోతే దానికి లోకేశే కారణమని ఇదే తన మరణ వాంగ్మూలంగా భావించాలన్నారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తానని మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. పోసాని ఇంకా ఏమన్నారంటే..

గతంలో లోకేశ్ నన్ను పార్టీలోకి రావాలని కోరారు. నేను నిబద్ధత కలిగిన నాయకుల వెంటే ఉంటానంటూ తిరస్కరించా. పైగా వారి అక్రమాలను ఎప్పటికప్పుడు నిలదీస్తున్నాను. అందుకే వాళ్లు నాపై కక్షగట్టారు. నేను ఎప్పుడో కంతేరులో లోకేశ్ భూములు కొన్నారని చెప్పానట. దానిని పట్టుకుని నాపై రూ.4 కోట్లకు పరువు నష్టం దావా వేశారు. అంతేకాదు.. రెండేళ్లు జైలుశిక్ష కూడా వేయిస్తారట. కంతేరులో హెరిటేజ్ పేరిట భూములు కొన్నది వాస్తవం కాదా? లోకేశ్ భూములు దోచేశారు.. కబ్జా చేశారనలేదే నేను. కొన్నారనే చెప్పాను. మీ కుటుంబ సభ్యులు కొంటే నీకు సంబంధం లేదా? మీ తల్లి, భార్య పేరు మీద ఉన్న ఆస్తులు ఎవరికి లోకేశ్?

పవన్ వ్యాఖ్యలు మర్చిపోయారా?

అల్‌ఖైదా అంటే లాడెన్ గుర్తొచ్చినట్లు.. హెరిటేజ్ అంటేనే చంద్రబాబు గుర్తొస్తారు. నిత్యం బూతులతో జపంచేసే లోకేశ్‌పై తాను పురువు నష్టం కేసువేస్తే 20 ఏళ్లు జైలులో ఉండాల్సి ఉంటుంది. గతంలో దళితులు, ముఖ్యమంత్రి జగన్‌ను, పోలీసు అధికారులను దుర్భాషలాడిన లోకేశ్ వీడియోలను, విదేశీ మహిళలతో అర్ధనగ్నంగా దిగిన ఫొటోలను మీడియా ఎదుట పోసాని ప్రదర్శించారు. గతంలోనే లోకేశ్ బతుకును పవన్ రోడ్డున పడేశారు. ప్రతి నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్ల కుంభకోణం చేశారంటూ పవన్ చేసిన వ్యాఖ్యలు మర్చిపోయారా? సమాజంలో బూతులు మాట్లాడేవాళ్ల కంటే బూతుపనులు చేసే లోకేశ్ లాంటి వ్యక్తులతోనే ఎక్కువ ప్రమాదం.

ఏపీలోని నా ఆస్తి మొత్తం ఇచ్చేస్తా..

చంద్రబాబుకు వ్యవస్థలను మేనేజ్ చేసే సత్తా ఉంది. అందుకే 16 కేసుల్లో స్టేలు తెచ్చుకున్నాడు. పుంగనూరులో పోలీసులపైనే దాడులు చేయించారు. నేనెంత బక్కవాడిని. నాలుగు పోట్లు వేస్తే నేను అవుట్. లోకేశ్ ఏంచేసినా కాపాడటానికి చంద్రబాబు ఉన్నారు. లోకేశ్ కంటే నాకు విశ్వసనీయత ఎక్కువ ఉంది.. అంతేగాని, అమ్ముడుపోయే వాడిని కాదు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా గెలవొచ్చు.. కమ్మ కులమే గెలవాలనుకోవడం దుర్మార్గం. ఎవరు గెలిచినా ప్రజలకు ఎంత మంచి చేస్తున్నారో చూడాలే తప్ప కులం దురాభిమానంలో పడకూడదు. రాజధానిలో ఐదు శాతం భూములు పేదలకు ఇవ్వాలని చట్టంలో ఉన్నప్పటికీ చంద్రబాబు దానిని తుంగలో తొక్కారు. కొంతమందికి కులం పిచ్చి ఎక్కించి నన్ను తిట్టిస్తున్నారు.



రాజధానిలో పేదలకు సెంటు భూమి ఇవ్వడంలో తప్పేంటని నేను ప్రశ్నిస్తే.. ఓ కమ్మ రైతు పెదకాకానిలో నాకున్న 16 ఎకరాలు ఇవ్వమంటూ బూతులు తిట్టాడు. అసలు నాకు అక్కడ భూమేలేదు. ఐదారు ఇళ్ల స్థలాలు, రెండు పెంకుటిళ్లు ఉన్నాయి. జగ్గయ్యపేట దగ్గర 30 ఏళ్ల కింద కొన్న కొంత భూమి ఉంది. మా నాన్న డబ్బులేక ఆత్మహత్య చేసుకున్నారు. నేను సినిమాల్లోకి వెళ్లిన తర్వాతే సంపాదించుకున్నా. అయినా, ఏపీలోని నా ఆస్తి మొత్తం పేద ప్రజలకు ఇచ్చేస్తా.. రాజధాని రైతులకు మానవత్వం ఉంటే పేదలకు సెంటు భూమి ఇవ్వండి. కోర్టు కేసులను వెనక్కితీసుకోండి.

రాజధాని భూముల్లో త్యాగాల్లేవు..

రాజధాని భూముల్లో వ్యాపారం తప్ప త్యాగాల్లేవు. రాజధాని ప్రకటన కంటే ఆరు నెలల ముందే రామోజీరావు, చంద్రబాబు ఫిల్మ్‌సిటీలో కూర్చుని భూముల కొనుగోలుపై చర్చించుకున్నారు. వైఎస్సార్ రూ.11వేల కోట్ల రైతు రుణమాఫీ చేస్తే అందులో తమ కులం వాళ్లు కూడా హాయిగా లబ్ధిపొందారు.. ఇప్పుడు పేదలకు తమ భూములు ఇవ్వొద్దని వారు చెప్పడం సిగ్గుచేటు.

కల్యాణ వైభోగమే..

- ఈ నెల19 నుంచి డిసెంబరు 31వరకు..
- 53 శుభ ముహూర్తాలు, అనుబంధ రంగాల ఆశలు

అచ్చంపేట: జిల్లా వ్యాప్తంగా పెళ్లిళ్ల సందడి నెలకొననుంది. రెండు నెలల తర్వాత శుభ గడియలు రావడంతో భజంత్రీలు మోగనున్నాయి. శ్రావణమాసం ఆరంభంతో జిల్లా వ్యాప్తంగా వివాహాలు, గృహ ప్రవేశాలు, పుట్టు పంచె, చీరలు, పుట్టు వెంట్రుకలు తీయడం తదితర శుభకార్యాలు నిర్వహించుకోవడానికి ముహూర్తాలు పెట్టుకునే పనిలో బిజీబిజీగా మారుతున్నారు. ఈనెల19 నుంచి డిసెంబరు 31 వరకు 5నెలల పాటు 53 శుభ ముహూర్తాలు ఉండటంతో వివాహాల హడావుడి మొదలైంది. ఇప్పటికే కల్యాణ మండపాలన్నీ బుక్కయ్యాయి. పురోహితులు, ఫొటోగ్రాఫర్లు, కేటరింగ్, డెకరేషన్, బ్యూటీ పార్లర్లు, ట్రావెల్స్, టైలర్స్, బ్యాండ్ మేళంకు గిరాకీ పెరిగింది. ఈ సీజన్‌లో సుమారు1,500 పైగా జంటలకు వివాహాలు జరగనున్నట్లుగా ఓ అంచనా. నిశ్చితార్థం పూర్తయిందంటే చాలు.. పెళ్లి పత్రికలు అచ్చు వేయించడం మొదలు పెడుతున్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది మంది ఉపాధి లభించనుంది.

శుభ ముహూర్తాలు

ప్రధానంగా ఈనెలలో 18వ తేదీ నుంచి ప్రారంభమైన ముహూర్తాలు డిసెంబరు వరకు మంచి ఘడియలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు.



మండపాలు రిజర్వ్..

జిల్లాలో 150కి పైగా కల్యాణ మండపాలున్నాయి. ఇప్పటికే అన్ని బుక్కైనట్లు నిర్వాహకులు చెబుతున్నారు. చిన్న మండపాలకు రూ.వేలల్లో ఉంటే, పెద్ద ఫంక్షన్ హాళ్లకు రూ.లక్షల్లో గిరాకీ పలుకుంది. ఏసీ హాళ్లయితే ఇంకా ఎక్కువగానే తీసుకుంటున్నారు.

ఈనెలలో ఆషాఢం, అధిక శ్రావణం కారణంగా వివాహాది శుభ కార్యాలకు రెండు నెలల పాటు బ్రేక్ పడింది. ఈ నెలలో 18, 19, 20, 22, 24, 26, 30, 31వ తేదీల్లో మంచి రోజులున్నాయి. సెప్టెంబర్‌లో 1, 2, 3, 6, 7, 8 తేదీలు, అక్టోబరు 18, 19, 20, 21, 22, 24, 25, 27, 31 తేదీలు, నవంబరులో 1, 2, 8, 9, 16, 17, 18, 19, 22, 23, 24, 25, 28, 29 రోజులున్నాయి. డిసెంబరులో 3, 5, 6, 7, 8, 14, 15, 16, 17, 19, 30, 21, 24, 31 తేదీల్లో దివ్య ముహూర్తాల్లో పెళ్లిళ్లు చేసుకునేందుకు ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారని పండితులు పేర్కొంటున్నారు.

ఐదు నెలల పాటు ముహూర్తాలు

‘‘రెండు నెలలుగా ముహూర్తాలు లేకపోవడంతో శుభకార్యాలు లేవు. ఈనెల18 నుంచి డిసెంబరు31 వరకు మంచి రోజులు ఉన్నాయి. పెళ్లిళ్లతో పాటు గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలకు 53 రోజులు అనువైన ముహూర్తాలున్నాయి.

– శ్రీనివాసశర్మ, పురోహితుడు, అచ్చంపేట

విందు.. పసందు..

వివాహ విందుల్లో రకరకాల వంటకాలు, భిన్న రుచులు అందించేలా ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. మండపం అలంకరణకు రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు.

కొనసాగుతున్న విశ్వశాంతి హోమం



జడ్చర్ల టౌన్: విశ్వశాంతి యాగ మహోత్సవంలో భాగంగా మంగళవారం యాగశాలలో వివాహం కాని ఆడవారికి వరపాశుపతం, మగవారికి కన్యాపాశుపత, హనుమత్ సుబ్రహ్మణ్య, విద్యాలక్ష్మీ హోమాలు జరిపించారు. వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య హోయాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఆంజనేయస్వామి హరి, లక్ష తమల పాకుల అర్చన జరిపించారు. పట్టణంలో బోనాల ఉత్సవం ఉండటంతో యాగ మహోత్సవానికి భక్తుల సంఖ్య కొంత తగ్గింది.

■ యాగ మహోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. వేద పండితుల మంత్రాలలు, భక్తుల నామ స్మరణల మధ్య కల్యానం జరిపించారు.

నా తరఫున మర్రి ప్రచారం చేయాలి: నాగం



మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు: మార్కండేయ ప్రాజెక్టును ఆరు నెలల్లో పూర్తి చేస్తానని.. చేయకుండా మాట తప్పిన మర్రి జనార్దన్‌రెడ్డి తనకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేయాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. 2018 ఎన్నికల సమయంలో ఆరు నెలల్లో మార్కండేయ ప్రాజెక్టు పూర్తి చేస్తానని చెప్పిన కేసీఆర్ మాటల్లో నిజమెంతో తెలుసుకుందామని ప్రాజెక్టు సందర్శనకు వెళ్తే.. నాతో పాటు గిరిజన, దళిత నాయకులపై కేసులు పెట్టారన్నారు. ప్రాజెక్టు పరిశీలనకు వెళ్తే కేసులు పెడతారా.. అని బిజినేపల్లి మండల కేంద్రంలో ధర్నాలో ప్రశ్నించామన్నారు. మరుసటి రోజే ఇక్కడి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ప్రాజెక్టు పరిశీలనకు వచ్చి ఆరు నెలల్లో మార్కండేయ ప్రాజెక్టును పూర్తి చేస్తానన్నారు. లేకుంటే నాగం జనార్దన్‌రెడ్డికి ఎన్నికల ప్రచారం చేస్తానని ఎమ్మెల్యే మర్రి చెప్పినట్లు గుర్తు చేశారు. మాట తప్పిన మర్రి.. నాకు మద్దతుగా ఎన్నికల ప్రచారానికి రావాలని పిలుపునిచ్చారు. ప్రాజెక్టులకు నాగం జనార్దన్‌రెడ్డి వ్యతిరేకం కాదని.. దాని పేరుతో జరుగుతున్న అవినీతికి మాత్రమే వ్యతిరేకమన్నారు. అవినీతి అక్రమార్కులకు మద్దతుగానే సీఎం కేసీఆర్ సిట్టింగులకు రాబోయే ఎన్నికల్లో టికెట్లను కేటాయించారని.. వారు సంపాదించిన అవినీతి సొమ్ముతో గెలుస్తారనే ధీమాలో కేసీఆర్ ఉన్నాడని ఆరోపించారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్థం రవి, పీసీసీ సభ్యుడు బాలగౌడ్, పాండు, హైమద్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

విద్యాభివృద్ధి కోసం రాజాబహదూర్ కృషి ఎనలేనిది



రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి విద్యాభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం జిల్లాకేంద్రంలోని పద్మావతీకాలనీలోని ఆయన విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు. మంత్రి మాట్లాడుతూ రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాలో పుట్టడం జిల్లావాసులకు ఎంతో గర్వకారణమని అన్నారు. హైదరాబాద్‌లో రెడ్డి హాస్టల్ ఏర్పాటు చేసి అనేక మందిని ప్రయోజకులను చేసిన ఘనత ఆయనదని అన్నారు. పోలీస్ అకాడమీకి ఆ మహనీయుని పేరు పెట్టి గౌరవించుకుంటున్నామని, జయంతి ఉత్సవాలు అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి స్వగ్రామాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని, ఆయన ఇంటిని మ్యూజియంలా మారుస్తామని తెలిపారు. పద్మావతీకాలనీ గ్రీన్‌బెల్టు ఉన్న ప్రాంతాన్ని రూ.2.50 కోట్లతో సుందరీకరిస్తామని, వేమన విగ్రహం కూడా ఏర్పాట చేస్తామని తెలిపారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి కులమతాలకతీతంగా విద్యాభివృద్ధికి కోసం ఎంతో పాటుపడినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, పాలమూరు రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి పోతుల రాఘవారెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఎన్.సురేందర్‌రెడ్డి, జి.వెంకట్రాంరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు ఉదయశ్రీ, రవికిషన్‌రెడ్డి, అనంతరెడ్డి, విఠల్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, పరమేశ్వర్ రెడ్డి, గిరిధర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, పాండురంగారెడ్డి, వరలక్ష్మి, స్వరూప, వంశీలత, శ్రీదేవి, వనజ, అనిత, సునీత పాల్గొన్నారు.

మాదిగల ఐక్యత చాటుదాం

- వర్గీకరణ ఉద్యమంలో అత్యంత కీలక దశ ఇది
- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

కొల్లాపూర్: త్వరలో నిర్వహించబోయే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయడం ద్వారా మాదిగల ఐక్యత చాటాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మాదిగల విశ్వరూప సభ జిల్లాస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని మహనీయుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ర్యాలీగా సమావేశ ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదిగలతోపాటు ఎస్సీ ఉపకులాల ప్రజలు విద్య, ఉద్యోగ రంగాలతోపాటు సామాజికంగా ఎదగాలంటే వర్గీకరణే పరిష్కార మార్గం అన్నారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే వందరోజుల్లో వర్గీకరణ చేస్తామని బీజేపీ నేతలు గతంలో మాట ఇచ్చారన్నారు. వంద నెలలు గడుస్తున్నా ఇచ్చిన మాట నిలుపుకోవడం లేదని విమర్శించారు. పార్లమెంట్‌లో వర్గీకరణ చేయాల్సిన బీజేపీ, ఒత్తిడి తీసుకురావాల్సిన కాంగ్రెస్, గుర్తు చేయాల్సిన బీఆర్ఎస్ ఈ మూడు పార్టీలు మాదిగలను కేవలం రాజకీయ ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయని దుయ్యబట్టారు. వర్గీకరణపై వారి నిజాయితీ ఏమిటో వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో తేలిపోతుందన్నారు. వర్గీకరణ బిల్లు ఆమోదం పొందితే వంద తరాలు అభివృద్ధి చెందుతాయని అభిప్రాయపడ్డారు. వర్గీకరణ సాధన కోసం నిర్వహించే విశ్వరూప మహాసభకు పార్టీలు, సంఘాలకతీతంగా మాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మందకృష్ణ సమక్షంలో కొల్లాపూర్ నియోజకవర్గంలో పోలీసుల దాడులకు గురైన పలువురు మాట్లాడుతూ పోలీసులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివ, రాష్ట్ర కార్యదర్శి యాదగిరి, శ్రీనివాస్, కార్తీక్, నర్సింహ, మద్దిలేటి, అగ్రస్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3లో ఉండవెల్లి యువకుడు

- గ్రామీణ ప్రాంతం నుంచి ఇస్రోలో విధులు నిర్వహిస్తున్న కృష్ణ
- డేటా సాఫ్ట్‌వేర్ రాసిన అనుభవం



ఇస్రోలో కృష్ణ

ఉండవెల్లి: చంద్రయాన్–3 ప్రయోగాన్ని దేశప్రజలు టీవీల్లో వీక్షించారు. అలాంటిది జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లికి చెందిన మద్దిలేటి, లక్ష్మిదేవిల కుమారుడు కృష్ణ ఇస్రోలో విధులు నిర్వహిస్తున్నారు. చంద్రయాన్–3కు డాటా ప్రాసెసింగ్ అండ్ అనాలసిస్ అనే వాటిని రాసినట్లు తెలిపారు. ప్రస్తుతం బెంగళూరులోని ఇస్రోలో లాబరేటరి ఫర్ ఎలక్ట్రో ఆప్టిక్స్ సిస్టమ్‌లో ఉద్యోగం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతను 2008లో ఉండవెల్లి జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి పూర్తి చేశాడు. పాలిటెక్నిక్ రాశి, కంప్యూటర్ ఇంజినీర్ చేసి 2017లో ఐఎస్ఆర్ఓ పరీక్ష రాయగా.. ఆల్‌ఇండియాలో 4వ ర్యాంక్ సాధించాడు. చంద్రయాన్–3లో ముఖ్యపాత్ర వహించి విధులు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి ఇస్రోలో బాధ్యతలు నిర్వహిస్తుండటంతో గ్రామీణ ప్రజలు వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

30న వేలం పాట

పాలమూరు: మహబూబ్‌నగర్ రేంజ్ పరిధితో పాటు మహమ్మదాబాద్ రేంజ్ పరిధిలో ఉన్న అడవిలో సీతాఫలం పండ్లు సేకరించడానికి ఈనెల 30న అటవీశాఖ డివిజన్ కాంప్లెక్స్‌లో వేలంపాట నిర్వహింస్తున్నట్లు డీఎఫ్ఓ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వేలం పాటదారులు ఈనెల 30న ఉదయం 10 గంటలకు హాజరుకావాలని, వేలంలో పాల్గొనేవారు రూ.5వేలు ధరావత్తు చెల్లించి హాజరు కావాలని సూచించారు.